www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 జనవరి 2024
5
అన్నమయ్య



'అన్నమాచార్య' విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో బిఫార్మసీ విద్యను అభ్యసించి తన బిఫార్మసీ విద్యలో 86.42 శాతాన్ని సాధించి నందుకు జెఎన్‌టియు విశ్వవిద్యాలయం నుంచి విద్యార్థి వడ్డె విశాలాక్షి బంగారు పతకంతో పాటు సర్టిఫికెట్ ప్రధానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డి.స్వర్ణలత తెలిపారు. పతకం సాధించడానికి తోడ్పడిన కళాశాల, యాజమాన్యం, అధ్యాపక బృందానికి విశాలాక్షి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత, వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, కోశాధికారి సి.అభిషేక్ రెడ్డి, చైర్మన్ రామచంద్రారెడ్డి, అధ్యాపక బృందం విశాలాక్షిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న చొప్పా గంగిరెడ్డి, కళాశాల సిబ్బంది

కళ్లు మూసుకుని అంగన్వాడీల నిరసన

- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- అంబేద్కర్ చిత్రపటాలకు వినతులు
- 39వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అంగన్వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు కళ్ళు మూసుకొని నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కళ్లు తెరిపించి తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు ఈశ్వరమ్మ, కార్యకర్తలు విజయ, అమరావతి, శివరంజని, గౌసియా, విజయలక్ష్మి, శివ జ్యోత్స్న పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** అంగన్వాడీలు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, ప్రాజెక్టు గౌరవ అధ్యక్షులు వనజ కుమారి, అధ్యక్షులు, శ్రీరమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్, రాధా కుమారి, మండల కార్యదర్శి జి.పద్మావతి, వెన్నెల, దుర్గ, శీరిష, లీలావతి, జయకుమారి, సుజాత, మునీంద్ర, ఈశ్వరమ్మ, కుమారి, నాగరాణి, వాణి, స్వర్ణలత, గీత, సురేఖ, కళ, రెడ్డమ్మ, రోజా, చెంచులక్ష్మి, బేబీ, సునీత, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జాన్ ప్రసాద్, నాయకులు సరోజ నిర్మల నాగమణి పాల్గొన్నారు. **బి.కొత్తకోట:** అంగన్వాడీలు తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ కనీస వేతనం అమలు, గ్రాట్యూటీ అమలు, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించడం, నాణ్యమైన పౌష్టికాహారం సరఫరా చేయడం, హెల్పర్లకు పదోన్నతులు కల్పించడం తదితర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు మరియు హెల్పర్లు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం అంగన్వాడీలు సమ్మెను కొనసాగిస్తున్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి మాట్లాడుతూ మహిళలు రోడ్డుపై కొచ్చి సమ్మ చేస్తుంటే ఈ ప్రభుత్వానికి అంగన్వాడీల గోడు పట్టడం లేదు మీరైనా జ్ఞానాన్ని ప్రసాదించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి ఓబులమ్మ, సెక్టార్ లీడర్లు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండలాలు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజంపేట : కళ్లు మూసుకొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



బి.కొత్తకోట : అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

న్యాయం జరిగే వరకూ పోరాటం

- రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అంగన్వాడీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఎఐటియుసి కార్యాలయంలో అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలుపుతూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ 38 రోజులుగా అంగన్వాడీలు తమ కుటుంబాలను వదిలి రోడ్లెక్కి నిరసనలు తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం చలనం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు లేనిపోని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు పూర్తయినా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం దారుణమని పేర్కొన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, డిమాండ్లు నెరవేర్చకపోతే ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలను కూడా కలుపుకుని ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీల సమ్మెకు మదతుగా శనివారం నిర్వహించనున్న రాస్తారోకోలో కార్మిక, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్మెస్ రాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలు రవికుమార్, ఐఎన్‌టియుసి ఇన్‌ఛార్జి పూల భాస్కర్, ఐఎఫ్‌టియు ఇన్‌ఛార్జి నాగేష్, పిడిఎస్‌యు నాయకులు నాగేశ్వర, ఎఐటియుసి పట్టణ కార్యదర్శి సికిందర్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మౌయిల్, రమణ, చంద్ర, సాదిక్, నాని, మున్సిపల్ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, ప్రసాద్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

గ్రామ స్థాయిలో విస్తృతంగా పశువైద్య సేవలు

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో పశువైద్య సేవలు గ్రామ స్థాయిలో పూర్తి అందుబాటులోకి రావాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో పశు వైద్య సేవలు రైతులకు అందుబాటులోకి రావాలన్నారు. క్షేత్ర స్థాయిలో మండల పశువైద్యాధికారులు, గ్రామ స్థాయి అధికారులు పశు వైద్య శాఖలో అమలవుతున్న పథకాల గురించి రైతులకు తెలియజేసి అధికారులు వారికి అందుబాటులో ఉండాలన్నారు. రబీ 2023-24, ఇ-పంట నమోదుకు సంబంధించి ఇప్పటి వరకు 90 శాతం పూర్తి చేశామన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ ఇ-పంట నమోదుకు చివరి తేదీ కావున పంటలు సాగు చేసే రైతులందరూ రైతు భరోసా కేంద్రాలలో ఈ పంట నమోదు 100 శాతం పూర్తి చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం 26,238 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు 8960 హెక్టార్లు సాగు చేశారని సాగు చేసిన పంటలన్నింటినీ ఇ-పంటలో గడువులోగా నమోదయ్యే విధంగా అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 16,014 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులందరికీ ఎరువులు పంపిణీ చేయాలన్నారు. ఎక్కడ ఎరువుల కొరత లేదన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాల గురించి వారికి తెలియజేసి రైతులందరూ సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అమలవుతున్న పండ్లతోటల విస్తీర్ణాన్ని తగ్గించి ఇతర పండ్లతోటలైన ఖర్జూరం, సీతాఫలం, జామ, వంటి పంటలు పెంచే విధంగా చర్యలు చేపట్టాలని ఉపాధి హామీ పథకం అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి చంద్రనాయక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు రవిరాజు, పశుసంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ పిళ్లై, వివిధ శాఖల జిల్లా అధికారులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా అందజేస్తాం

- జిల్లా పరిశీలకులు మురళీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా అందేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మురళీధర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లాకు ఓటర్ల జాబితా 2024పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ జిల్లా ఓటర్ల జాబితాలో ఉన్న వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓటర్ల జాబితా పరిశీలకులకు వివరించారు. జిల్లాలో మొత్తం 1607 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఒక్కొక్క పోలింగ్ కేంద్రానికి సగటున 845 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 2011 జనాభా ప్రకారం ఇపి రేషియో 688 ఉందని, 2024 ముసాయిదా జాబితా ప్రకారం, జనవరి 12వ తేదీ నాటికి ఇపి రేషియో 690 ఉన్నట్లుగా తెలిపారు. స్త్రీ పురుష నిష్పత్తి, జిల్లాలో 1035 ఉందని, రాజంపేటలో అత్యధికంగా 1050 ఉన్నట్లుగా ఈ సందర్భంగా తెలియజేశారు. 18 నుంచి 19 సంవత్సరాల వయసు గల ఓటర్లు దాదాపు 32 వేల మంది ఉన్నట్లుగా తెలియజేశారు. సర్వీస్ ఓటర్ల గురించి వివరిస్తూ జిల్లాలో 1306 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లుగా తెలిపారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిశీలించి వాటికి సంబంధించిన నివేదికలను ప్రధాన ఎన్నికల అధికారికి సమర్పించామని ఓటర్ల జాబితా పరిశీలకులకు వివరించారు. అనంతరం ఎన్నికల జాబితా పరిశీలకులు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీ సంతృప్తికరంగా ఉందని, ఎన్నికల సంఘం అనుమతి వచ్చిన తరువాత గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా కాపీలను ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణ, మదనపల్లి రాయచోటి ఆర్‌డిఒలు మురళి, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి



పులివెందులలో టిడిపి జెండా ఎగురవేస్తాం

రా.. కదిలిరా బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

- 'ఉక్కు' ఏర్పాటులో అలసత్వం
- 'సీమ'ను రతనాలసీమగా మారుస్తా
- కడప హజ్‌హౌస్ పనుల్లో నిర్లక్ష్యం
- భూ కబ్జాదారులను వదలబోం
- కమలాపురం రా..కదలిరా సభలో చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అంతులేని నిర్లక్ష్యం వహించడం దారుణమని టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. శుక్రవారం ఆయన జిల్లాలోని కమలాపురం నియోజకవర్గ కేంద్రంలో టిడిపి ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రా..కదలిరా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప స్టీల్‌ప్లాంట్, సాగు నీటి ప్రాజెక్టు, డ్రిప్‌ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల్లో ఎటువంటి పురోగతీ లేకుండా పోయిందన్నారు. మాటలు కోటలు దాటాయని, చేతలు గడప దాటడం లేదని విమర్శించారు. తాను అధికారంలో ఉంటే ఖరీఫ్, రబీ సీజన్‌లో నష్టపోయిన నేపథ్యంలో కరువు మండలాలుగా ప్రకటించే వాడినని తెలిపారు. సాగర్ నీటిని నల్లమలలో టన్నెల్ తవ్వి బనకచర్లలో పోసి రాయలసీమ తలరాతనే మార్చేస్తానని తెలిపారు. జిల్లాలో పది ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లను ఇచ్చినప్పటికీ ప్రజల జీవితాల్లో ఎటువంటి మార్పు రాలేదని తెలిపారు. మళ్లీ అన్ని సీట్లు ఇచ్చి గెలిపిస్తారా తమ్ముళ్లూ అని ప్రశ్నించారు. ఈదఫా పులివెందుల్లో టిడిపి జెండాను ఎగుర వేయడం తథ్యమన్నారు. వైఎస్ వివేకా హంతకులకు ఓట్లేస్తారా అని ప్రశ్నించారు. నాసిరకం వైన్స్ ద్వారా ప్రజారోగ్యాన్ని పాడు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, కరెంటు, ఆర్టీసీ, చెత్త ఛార్జీలను అమాంతంగా పెంచేశారని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన సుపరిపాలన హామీ ఏమైందన్నారు. గండికోట తెలుగుగంగ, నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తామన్నారు. 2014 -2019 టిడిపి హయాంలో 12,050 కోట్లు ఖర్చు చేశామని, వైసిపి హయాంలో ఏమేరకు ఖర్చు చేశారో చెప్పాలని నిలదీశారు. త్వరలో రైతు రాజ్యం రాబోతుందని, రైతులే రాజ్యం చేస్తారని పేర్కొన్నారు. రూ.95 కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లకు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దువ్వూరు వాసి అక్బర్‌బాషా భూమిని ముఖ్యమంత్రి బంధువు తిరుపాల్‌రెడ్డి కబ్జా చేయడం పరాకాష్ఠకు చేరుకుందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే 22 ఎ చట్టాన్ని రద్దు చేస్తామని తెలిపారు. కబ్జాదారులను వదలబోమని హెచ్చరించారు. రైతుల పాసుపుస్తకాలపై బొమ్మలు వేయించుకోవడంతో పిచ్చి పరాకాష్ఠకు చేరుకుందని తెలిపారు. చివరికి వైవియూలోని వేమన విగ్రహాన్ని తొలగించి తన విగ్రహం పెట్టించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. చెల్లికి, తల్లికి న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్రానికి ఏమి చేస్తాడని పేర్కొన్నారు. అన్న క్యాంటీ న్లను పునరుద్ధరిస్తామని తెలిపారు. కర్నూలులో హై కోర్టు, విశాఖ, కడప, అనంతపురం జిల్లాలను అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం జిల్లాలోని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే బెట్టింగ్ ప్రసాద్‌గా మారిపోయాడన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కబ్జాదారిగా మారాడని విమర్శించారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి యాక్టర్‌గా మారిపోయాడని తెలిపారు. బద్వేల్ నాయకులు కబ్జాలకు కేరాఫ్ అడ్రెస్‌గా మారారని విమర్శించారు. డిప్యూటీ సిఎంగా ఉన్న అంజాద్‌బాషా ఉత్సవ విగ్రహంగా మారాడన్నారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కరెప్షన్ కింగ్‌గా మారాడని విమర్శించారు. ఈయన లేపాక్షి భూముల దగ్గర నుంచి బుగ్గవంక వరకు కబ్జా యత్నం చేశారన్నారు. పోతిరెడ్డిపాడు, నిప్పులవాగు, కెసి కెనాల్ సామర్థ్యాలను పెంచుతామన్నారు. టిడిపి, జనసేన కార్యకర్తలు సమష్టిగా 82 రోజులు గ్రామాల్లో తిరిగి పని చేస్తే మిమ్మల్ని ఆదుకునే బాధ్యత తీసు కుంటానని భరోసా నిచ్చారు. కార్య క్రమంలో అనంత పురం జిల్లాకు చెందిన మాజీమంత్రి కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, విజయమ్మ, మాజీ ఎమ్మెల్సీలు బి.టెక్‌రవి, బత్యాల చెంగల్రాయులు, బచ్చల పుల్లయ్య, రాయచోటి, కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఇన్‌ఛార్జులు ఆర్.రమేష్‌రెడ్డి, మాధవీరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, భూపేస్‌రెడ్డి, బద్వేలు యువ నాయకులు రితేష్‌రెడ్డి, వేలాది మంది టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్రబాబుకు నాగలి అందజేస్తున్న నాయకులు, కార్యకర్తలు

బకాయిలను తక్షణం చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని యుటిఎఫ్ నాయకులు విమర్శించారు. యుటిఎఫ్ పోరుబాటలో భాగంగా ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తున్నందుకు ఆందోళన వ్యక్తం చేస్తూ శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో నోటికి నల్ల రిబ్బన్ ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా ఉద్యోగులపై ప్రేమ కురిపించిన జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ, ఉద్యోగుల, పెన్షనర్ల పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. తమకు చెల్లించాల్సిన బకాయిల గురించి అడిగితే ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగి స్తున్నారన్నారు. ఉద్యోగులకు న్యాయంగా చెల్లించాల్సిన బకాయిలను దాటవేసే వైఖరి అవలంభిస్తున్నారని విమ ర్శించారు. ఉద్యోగుల సొమ్మును ప్రభుత్వ అవసరాలకు వాడుకోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. డిఎ, పిఆర్‌సి, సరెండర్ లీవ్, ఎపిజిఎల్ఐ, మెడికల్ రీయిం బర్స్‌మెంట్, పదవ తరగతి పరీక్షల రెమ్యునరేషన్, సిపిఎస్ మ్యాచింగ్ గ్రాంట్ మొదలైన బకాయిలు దాదాపు రూ.18 వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్‌రాజు, జిల్లా కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, రమణమూర్తి, రెడ్డెమ్మ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, విశ్రాంత యుటిఎఫ్ నాయకులు ప్రతాప్, సుబ్బరాజు, భాస్కర్ రాజు, సుబ్బయ్య, రాజంపేట, పెనగలూరు, నందలూరు, పుల్లంపేట మండలాల నాయకులు పాల్గొన్నారు. **రాయచోటి :** బకాయిలను చెల్లించక పోవడం ఎలాంటి న్యాయమో ప్రభుత్వ పెద్దలు చెప్పాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చిన ప్పటికీ ఆయా బకాయిలను చెల్లించకపోవడం తీవ్ర అన్యాయం చేసినట్లుగా తెలిపారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలనిమ తెలిపారు. 12వ పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ ఆ కమిటీ విధి విధానాలు వెల్లడించకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయులను మభ్యపెట్ట డమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు ప్రసాద్, రాయచోటి మండల అధ్యక్షుడు హాఫీజుల్లా, సహాధ్యక్షులు రఫీ, చిన్నమండెం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి సహాధ్యక్షుడు కిఫాయతుల్లా, రెడ్డిముని సుధాకర్, సీనియర్ నాయకులు ఉమా శంకర్, వీరబల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగార్జున, అమీనుల్లా పాల్గొన్నారు. **మదనపల్లి:** స్థానిక బెంగళూరు రోడ్‌లోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నోటికి నల్ల రుబ్బన్లు కట్టుకుని నిరసన దీక్ష చేపట్టినట్లు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్ నాయుడు, సహ అధ్యక్షులు హేమలత, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, భాస్కరరెడ్డి, ఆదినారాయణ, డివిజన్ కన్వీనర్ ఎగవింటి సుధాకర్ పాల్గొన్నారు. **పీలేరు:** ప్రభుత్వం దిగివచ్చి పెండింగులోని ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆర్థిక బకాయిలను చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామని యుటిఎఫ్ నాయకులు హెచ్చరించారు. అంబేద్కర్ విగ్రహం ముందు వారు మూతికి నల్ల బ్యాడ్జీలు కట్టుకుని నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి, జిల్లా ట్రెజరర్ చంద్రశేఖర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ గౌరవాధ్యక్షులు రాధాకృష్ణ, సిపిఎస్ కన్వీనర్ రమేష్ రెడ్డి, వెంకటరమణ దేవేందర్ రెడ్డి, విజయకుమార్, అనిరుద్రయ్య పాల్గొన్నారు.



రాజంపేట : నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు



మదనపల్లె : నిరసన చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

జాబితాను త్వరగా సమర్పించండి : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో నియోజకవర్గాల వారీగా సమస్య ఆత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను సమర్పించాలని జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లో ముసాయిదా ఓటర్ల జాబితా 2024, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ఈ నెల 22వ తేదీ నాటికి పూర్తవుతుందని, అనంతరం ఎన్నికల సంఘం అనుమతి తర్వాత గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితా అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే సమర్పించాలని రాజకీయ పార్టీలను కోరారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల జాబితాను త్వరగా సమర్పించాలని రాజకీయ పార్టీలను కోరారు. అభ్యంతరాలకు సంబంధించి మాట్లాడుతూ ఆర్‌పిఎ చట్టం 1951లోని సెక్షన్ 31కు అనుగుణంగా అభ్యంతరాలను సమర్పించాలని కోరారు. సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణ, మదనపల్లె, రాయచోటి ఆర్డీవోలు మురళి, రంగస్వామి పాల్గొన్నారు.

28 నుంచి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు : డిఆర్ఒ


ప్రజాశక్తి-రాయచోటి

రాజంపేటలో అండర్-14 బాలికల కబడ్డీ పోటీలను ఈ రోల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహింస్తామని డిఆర్ఒ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని డిఆర్ఒ ఛాంబర్‌లో 67వ జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీల నిర్వహణపై ఆయన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట పట్టణంలోని జీసస్ హైస్కూల్లో నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడా పోటీలకు రాష్ట్రంలోని జవహర్ నవోదయ పాఠశాలల నుంచి 44 టీములు వస్తాయని తెలిపారు. క్రీడా పోటీలకు సంబంధించి ఇప్పటివరకు 31 టీమ్‌లు ఆన్‌లైన్ రిజిస్టర్ చేయించుకున్నాయన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించుకోవచ్చునన్నారు. కబడ్డీ క్రీడా పోటీలకు 450 మంది క్రీడాకారులు వస్తారని చెప్పారు. టెక్నికల్, ఇతరులు 150 మంది, ఈ ప్రాంతానికి చెందిన లోకల్ పీడీలు, పిఇటిలు 150 మంది హాజరవుతారని తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజన, రవాణాకు సంబంధించి 20 కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. జాతీయ స్థాయి బాలికల కబడ్డీ పోటీలలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఘనంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగస్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ వసంత, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ వృథాను అరికట్టాలి : ఎస్ఇ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యుత్ వృథాను అధికట్టాలని, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని, అధికారుల పనితీరు మెరుగుపడకపోతే చర్యలు తప్పవని ఉమ్మడి జిల్లా విద్యుత్ ఎస్ఇ ఎస్.రమణ పేర్కొన్నారు. రాజంపేట విద్యుత్ డివిజన్ పరిధిలోని సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లి, చిట్వేలి, కోడూరు మండల క్షేత్రస్థాయి అధికారులతో రాజంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విద్యుత్ కార్యాలయంలో శుక్రవారం ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులు విడుదల చేయుటలో జాప్యం లేకుండా వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. రానున్న వేసవికాలం దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించుటకు అవసరమైన ప్రాంతాలలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పగటిపూట వీధి దీపాలు వెలగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనితీరు మెరుగుపడకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ బకాయిలు నెలనెలా పెరుగుతున్నాయని, రూ.10.37 కోట్ల మేర విద్యుత్ బకాయిలు ఉన్నాయని, విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రాధాన్యతతో దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులు చేసి విద్యుత్ ప్రమాదాలు లేని డివిజన్‌గా కృషి చేయాలని తెలిపారు. విద్యుత్ చౌరన్ని అరికట్టాలని, వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన తగు చర్యలు తీసుకోవాలన్నారు. మాటల్లో కాకుండా పనులలో ప్రావీణ్యం చూపించాలన్నారు. సమావేశంలో రాజంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు, జెఇలు అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ రమణ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-కలకడ

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోనలో 8వ తరగతి విద్యార్థులకు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మెడెమ్ చెంగలరాముడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని మంచి ప్రావీణ్యాన్ని సంపాదించుకోవాలని సూచించారు. ట్యాబ్‌లో విలువైన సమాచారం ఉందని దానిని మాత్రమే చూడాలని సూచించారు. కార్యక్రమంలో సరళమ్మ, మధుసూదన్‌రెడ్డి, కమిటీ చైర్మన్ భాస్కర రెడ్డి, ఉపాధ్యాయులు శివారెడ్డి, కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

ప్రజాశక్తి-రాయచోటి

ఆర్‌టిసి సమస్యలపై శనివారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి పి.రాము శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎపిఎస్‌ఆర్‌టిసికి సంబంధించి ఎటువంటి సమస్యలున్నా సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యక్రమంలో తమ సమస్యలు తెలియజేయాలన్నారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలను, సూచనలు, సలహాలను 8985283211, అనే నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలుపవచ్చని పేర్కొన్నారు.

అంతరాయంలేని విద్యుత్‌ను అందించేందుకు కృషి

ప్రజాశక్తి-చిట్వేలి

అంతరాయంలేని నిరంతరవిద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషిచేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఇఎస్.రమణ సూచించారు. ఈ మేరకు శుక్రవారం చిట్వేలి విద్యుత్ శాఖ కార్యాలయంలో బాకరాపురం సబ్‌స్టేషన్, తదితర ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్లను పరిశీలించారు. అనంతరం చిట్వేలి సబ్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పగటిపూట వీధిలైట్లు వెలిగితే సహించబోమని హెచ్చరించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టి పెట్టుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్తట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయడం, లైన్ల వెంబడి తిరిగి తప్పులను గుర్తించి మరమ్మతులు చేస్తామని చెప్పారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని, వంగిపోయిన స్తంభాలను, తగ్గులో ఉన్న లైన్లను యుద్ధప్రాతి పదికన మార్చాలని సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలుఅందించడంలో నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. వ్యవసాయ పొలాలకు లో హై వోల్టేజ్ విద్యుత్ ద్వారా విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. దాని వల్ల విద్యుత్‌కు అంతరాయాలు ఏర్పడటమే కాకుండా విద్యుదాఘాత ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. కార్యక్రమంలో రాజంపేట డివిజన్ డిఇ రాజశేఖరరెడ్డి, రైల్వేకోడూరుసబ్‌డివిజన్ డిఇఇ భాస్కర్‌రావు, ఎఇ వెంకట చలపతి,పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అలీఖాన్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్



కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాయచోటి పట్టణానికి చెందిన పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్‌ను నియమిస్తూ శుక్రవారం డిసిసి అధ్యక్షులు షేక్ అల్లాబకష్ నియామక పత్రాన్ని అందించారు. స్థానిక అలిమా బాద్‌వీధికి చెందినమహమ్మద్ గత 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధితో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కృషి చేస్తున్నారని అన్నారు. దివంగత నేత వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాం నుంచి కాంగ్రెస్ పార్టీలో ప్రజలకు సేవలు అందిస్తూ పార్టీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తూ వస్తున్నారని అన్నారు మైనార్టీ సెల్ చైర్మన్‌గా ఉన్న ఆయన సేవలు గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్, రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి తులసిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ వైస్‌ఛైర్మన్ మహమ్మద్‌రఫీ, జిల్లా కార్యదర్శి బషీర్‌అహ్మద్, అమీర్, నిస్సారహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపి పాలనలో దళితులపై దమనకాండ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

వైసిపి ప్రభుత్వ పాలనలో దళితులపై దమనకాండ సాగుతుందని దళిత నాయకులు, రాజం పేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు రమేష్ పేర్కొన్నారు. వర్షిణ నుండి జైల్లో మగ్గిపోతున్న కోడికత్తి శ్రీనుకు మద్దతుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం దగ్గర వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. వైసిపి పాలనలో దళితులపై వివక్ష ఎక్కువైందని అన్నారు. దళితులపై దాడులు జరుగుతున్నా సిఎం జగన్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు మండలపార్టీ అధ్యక్షులు కొమ్మ శివ, రాజంపేట పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిన్న శ్రీరాములు, రమేష్, నరసింహులు, రమణయ్య పాల్గొన్నారు.



సోమశిల వెనుక జలాలలో చేప పిల్లలను వదులుతున్న ఎంపిపి

సోమశిల వెనుకజలాల్లో చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని కోనాపురం గ్రామంలోని సోమశిల వెనుక జలాలలో ఎంపిపి మేడా విజయ భాస్కర్ రెడ్డి, డిఎఫ్ఒలు సుస్మిత, మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో 18.66 లక్షల చేప పిల్లలను సోమశిల వెనుక జలాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 40 శాతం సబ్సిడీతో 18.66 లక్షల చేప పిల్లలు విడుదల చేయడం జరిగిందని అన్నారు. వీటిలో 8 లక్షల చేప పిల్లలు బహుదా మత్స్య క్షేత్రం నుంచి రెండు లక్షల చేప పిల్లలు రాజంపేట మత్స్య క్షేత్రము నుండి, 1.2 లక్షలు చేప పిల్లలు, 7.46 లక్షలు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 40 శాతం సబ్సిడీతో విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డిఎఫ్ఒ సుస్మిత, పీలేరు డిఎఫ్ఒ మోహన్‌కృష్ణ, ఇరిగేషన్ ఇఇ కృష్ణమూర్తి, ఇంచార్జ్ అసిస్టెంట్ ఇన్స్‌పెక్టర్ సుబ్బనరసయ్య, వైసిపి నాయకులు పెంచలయ్య, లైసెన్స్ దారులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల మాటలువిని అధికారులు బలికావొద్దు :'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ అధికారులు అధికార పార్టీ నాయకుల మాటలు విని అనవసరంగా బలి కావద్దని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యేలు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా తీర్థయాత్రల పేరుతో ప్రజలు, మహిళలను తిరుపతికి తరలించి దొంగఓట్లు వేపించి తిరుపతి ఎంపీగా డాక్టర్ గురుమూర్తిని గెలిపించారని ఆరోపించారు. ఐఎఎస్ అధికారులు సైతం అధికార పార్టీ నాయకుల మాటలకు తలొగ్గి తప్పు చేశారని ఎన్నికల కమిషన్ తేల్చడంతో వారు సస్పెన్షన్‌కు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఎన్నికల కమిషన్ అధికారులపై నమ్మకంతో ఎన్నికల విధులు అప్పగిస్తే వైసిపి నాయకులు వారి లాగిన్ లోకి చొరబడి మార్పులు, చేర్పులు చేసి దొంగ ఐడిలు, దొంగ ఓట్లు చేర్చిన ఫలితంగా ప్రస్తుతం నిజాయితీపరులైన ఉద్యోగులు సస్పెన్షన్‌కు లోనై అవమానం పాలు కావడం దురదృష్టకరమని అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు మల్లారపు రవి ప్రకాష్ నాయుడు, సూర్య ప్రకాష్ నాయుడు, కోటపల్లి బాబురెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అమర్నాథరెడ్డి, రామ్మూర్తి, లక్ష్మీకర, షౌకత్, పోలిశెట్టి సురేంద్ర, రెడ్డప్ప రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

చంద్రబాబు బహిరంగ సభను దిగ్విజయం చేద్దాం

పీలేరులో ఈనెల 24న ఉదయం 11 గంటలకు జరగనున్న టిడిపి అధ్యక్షులు చంద్రబాబు రా కదిలిరా కార్యక్రమంలో భాగంగా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బహిరంగ సభను నిర్వహించనున్నారని అన్నారు. ఈ సభకు అధిక సంఖ్యలో ప్రజలు, అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లి-2 సచివాలయం పరిధిలో వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు, ఎంపిడిఒ శేషగిరిరావు, సర్పంచ్ రెడ్డమ్మ, నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఆరోగ్యాన్ని మరింత చేరువ చేయడానికి వైద్య ఆరోగ్య రంగంలో ప్రతి గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు ప్రజల ఆరోగ్యాన్ని సర్వే చేసి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తున్నట్లు తెలిపారు. వైద్య బృందమే నేరుగా వారి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలను, వైద్య సేవలను అందించి మందులను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి, బిపి, షుగర్ వంటి సమస్యలు కలిగిన వారికి 104 రకాల పరీక్షలు చేసి వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. 312 మంది జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య సేవలు పొందగా, అందులో 152 మందికి ల్యాబ్ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి వైఎస్ ఆర్ ఆరోగ్యశ్రీ కార్డును మంజూరు చేశారని అన్నారు. నేడు ప్రభుత్వ ఆస్పత్రులు, కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా పనిచేస్తున్నాయని వివరించారు. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డమ్మ, వైసిపి నాయకులు నరేంద్రరెడ్డి, ఎంపిడిఒ శేషగిరిరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ మహతి, పంచాయతీ కార్యదర్శిలు మారెప్ప, ఎర్రమల్లయ్యనాయుడు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** గ్రామీణ ప్రాంత నిరుపేదలకు గ్రామాలలోని మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం కుక్కరాజుపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వమించినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాలకే డాక్టర్లు, వైద్య సిబ్బంది వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేంద్రనాథ్, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌కు పరామర్శ

ప్రజాశక్తి-ములకలచెరువు

అనారోగ్యంతో బెంగులూరులో సెయింట్ జాన్సన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ టిడిపి నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ జడ్‌పిటిసి బూర్లపల్లి కృష్ణారెడ్డిని టిడిపి నియోజకవర్గ నాయకులు దాసిరిపల్లి జయచంద్రారెడ్డి, పారిశ్రామిక వేత్త గిరిధర్ రెడ్డిలు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఆరోగ్య పరి స్థితిని అడిగి తెలుసుకొని వారికి ధైర్యం చెప్పారు. క్రిష్ణారెడ్డి త్వరితగతిన కోలు కోవాలని, సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా మార్గ దర్శిగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

వృథాగా పోతున్న తాగునీరు

- పట్టని అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-బి.కొత్తకోట



వృథాగా పోతున్న నీరు

మండలంలోని కోటవూరులో ట్యాంక్ నుంచి నీరు వృథా పోవడమే కాకుండా,ఆ నీరు మురుకునీటితో చేరి కలుషితమవుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేనీటిని ప్రజలు తాగునీరు ఉపయోగిస్తూ రోగాల బారిన పడుతున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రజలు మాట్లాడుతూ చాలా రోజులుగా ట్యాంక్ నుండి నీరు వృథాగా పోతోందని, ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నామని, ఇప్పుడు ఇలా కలుషిత నీరుతాగడం వల్ల మరింత అనారోగ్యానికి గురవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సిఎం జగన్ దళిత ద్రోహి : ఆర్ఆర్

ప్రజాశక్తి-రాయచోటి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ద్రోహి అని, రాజ్యాంగాన్ని అమలు చేయలేని వ్యక్తి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ముమ్మాటికి మరోసారి దళితులను మోసం చేయడానికేనని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నాలుగున్నరేళ్లలో దళితులపై ఆరు వేలకు పైగా దాడులు జరిగాయని, ఇలా దాడులు జరుగుతుంటే ఈ వైసిపి ప్రభుత్వం చూస్తూ ఉండిపోయిందని అన్నారు. గతంలో టిడిపి అమలు చేసిన 27 సంక్షేమ పథకాలను వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దుచేసిందని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న 50వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయలేని సిఎం దళితుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పులివెందుల మొదలుకొని అన్ని నియోజకవర్గాల్లో దళితులపై దాడి జరుగుతుంటే ఎటువంటి చర్యలు తీసుకోలేని వ్యక్తికి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే తప్ప దళితులకు న్యాయం జరగదని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలీ, సంబేపల్లి మాజీ జడ్‌పిటిసి మల్లు నరసారెడ్డి, పేమ్మాడపల్లి సర్పంచ్ వాసు, క్లస్టర్ ఇన్‌ఛార్జి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

త్వరలో నిర్వహించనున్న డిఎస్‌సిలో ఉర్దూ మీడియం ఎస్‌జిటి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ ఖాళీలన్నింటిని భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్. కె.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్‌కు రూట రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ ఆయూబ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శీ జాఫరుద్దిన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సబాతుర్ రహమాన్ వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని మహల్ లో అయన స్వగృహం కలిసి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా సరిపడ ఉపాధ్యాయులు లేక ఉర్దూ మీడియం విద్యార్థులు ఎంతో నష్ట పోయారని అన్నారు.రాబోయే డిఎస్‌సిలో ఖాళీలన్నింటిని భర్తీ చేసి నిరుద్యోగ ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా మానిటరింగ్ అధికారి (ఉర్దూ) ముహమ్మద్ హాషిం, రుట రాష్ట్ర నాయకులు హుమాయుద్దీన్, షబ్బీర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాదిక్ అలీషా, ఉర్దూ ఉపాధ్యాయులు జబీవుల్లా, షానవాజ్, నాసిర్, నిసార్ , జాహిద్ షా, ఇబ్రహీం పాల్గొన్నారు.

మంచి జీవనశైలితో వ్యాధుల్లేని సమాజం

ప్రజాశక్తి-పీలేరు

మంచి జీవనశైలితో వ్యాధుల్లేని సమాజం సాధ్యమని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. శుక్రవారం తలుపుల పిహెచ్‌సి వైద్యుల ఆదేశాల మేరకు చింతలబైలు, యనాదుల కాలనీలో సీజనల్ వ్యాధుల చికిత్సలు, మందుల పంపిణీ, ముందస్తు వ్యాధుల నిర్మూలనలో భాగంగా ఆరోగ్య విద్య కార్యక్రమాలను పారమెడికల్ బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లు, పొగాకు వాటి ఉత్పత్తులకు, మద్యపానం మొదలగు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేను తప్పక పాటించాలని అన్నారు. ఇంటితో పాటు పరిసరనాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శుభ్రతకు అధిక ప్రాధాన్యత నివ్వాలని, స్పర్శ లేని మచ్చలు కుష్టు కావచ్చని, వ్యాధుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత చికిత్స పొందాలని తెలియజేశారు. కార్యక్ర మంలో పర్యవేక్షకులు శ్రీనివాసులు, పాముస్నిసా, సిహెచ్‌ఒ లావణ్య, ఆశ కార్యకర్త హంసవేణి పాల్గొన్నారు.

ఎపిజెఎసి మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా నిర్మలాదేవి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఎపి జెఎసి జిల్లా మహిళా విభాగం ఆవిర్భావ సమావేశం శుక్రవారం ఎన్‌జిఒ భవనం నందు ఎపి జెఎసి అమరావతి చైర్మన్ పి.నరసింహకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా విభాగం చైర్ పర్సన్‌గా నిర్మలాదేవి (రెవిన్యూ), ప్రధాన కార్యదర్శిగా ఎం.సాలమ్మ (ఆర్‌టిసి), వివిధ శాఖలకు చెందిన మరో పది మందిని ఎంపిక చేసినట్లు జెఎసి అమరావతి చైర్మన్ నరసింహ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ మల్లికార్జున, ఎపి జెఎసి రాష్ట్ర సెక్రటరీ పలిశెట్టి దామోదర్, ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జిడి.నరసయ్య, రాష్ట్ర మహిళా విభాగా చైర్‌పర్సన్ పారే లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, అసోసియేట్ చైర్ పర్సన్ సైకం శివకుమారి గంటా పావని, వివిధ సంఘం నాయకులు,అధిక సంఖ్యలో మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆవులు మృతి.. రైతుల నిరసన

ప్రజాశక్తి-రామాపురం

గత నాలుగు రోజుల నుంచి రాచపల్లి గ్రామంలో 15 ఆవులు మృతి చెందడంతో ఆవుల యజమానులు శుక్రవారం మండల కేంద్రమైన రామాపురంలోని మూడు రోజుల కూడలిలో మృతి చెందిన ఆవుతో నిరసన దిగారు. మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డికి చెందిన నాలుగు ఆవులు, ప్రసాద్ రెడ్డికి నాలుగు, అమృత నాయుడు చెందిన రైతుల 15 ఆవులు గత నాలుగు రోజుల నుంచి వరుసుగా మృతి చెందడంతో రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మృతి చెందిన ఆవులు ఏ కారణంతో మృతి చెందుతున్నాయో తెలియడం లేదని ఒక్కొక్క ఆవు విలువ రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఉంటుందని తెలిపారు.ఆవులు మృతి చెందడంతో పది లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనకు దిగిన రైతులను స్థానిక ఎస్ఐ సమస్యను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చి ఆందోళనను విరమింప జేశారు. స్థానిక పశు వైద్యాధికారుల దృష్టికి తీసుకపోవడంతో పరిశీలించి విటమిన్ల లోపంతో మృతి చెందుతున్నట్లు తెలిపారు. శనివారం రాచపల్లి గ్రామంలో పశు వైద్య డిడి మాల కొండయ్య, ఎడి బెనర్జీ, మండలం పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు పశువులు సంచరించిన ప్రదేశాలను పరిశీలించారు. ఆవుల మృతికి కారణాలను తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు. మృతి చెందిన ఆవుకు శనివారం పోస్టుమార్టం నిర్వహించి వ్యాధికి సంబంధించిన ఆధారాలను కనుగొంటామని వారు తెలిపారు.



మృతి చెందిన ఆవుతో నిరసన తెలుపుతున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు



కులగణన సర్వేలో ఎంపిడిఒ శేషగిరిరావు

పక్కాగా కులగణన సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వేను శుక్రవారం నుంచి పంచాయితీ అధికారులు చేపట్టడం జరుగుతున్నాదని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. అందులో భాగంగానే శుక్రవారం నిమ్మనపల్లి మండలంలోని 12 సచివాలయాల పరిధిలో పంచాయతీ అధికారులు కులగణన సర్వేను క్షేత్రస్థాయిలో ప్రారంభించడం జరిగిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన కులగణన సర్వేను పరిశీలించి ఎదురయ్యే ఇబ్బందులను, సర్వే జరుగుతున్న తీరును పర్యవేక్షించి, అధికారులు పక ద్బందీగా సర్వే చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి స్వయంగా వెళ్లి ఇంటిలోని కుటుంబ వ్యక్తుల కులమును తెలుసుకొని సర్వే యాప్‌లో పొందుపరచాలని పేర్కొన్నారు. కులగణన సర్వే 28వ తేదీ వరకు పది రోజులపాటు జరుగుతోందని తెలిపారు. ఇంటి వద్ద అందుబాటులో లేని కుటుంబాల కోసం ఈనెల 29 నుంచి ఫిబ్రవరి నెల 2వ తేదీ వరకు మరోసారి అవకాశం కల్పించి సర్వేను చేస్తారని తెలిపారు. ప్రజలు ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద ఉండి అధికారులు తమ ఇంటికి వచ్చినప్పుడు వారి కుల వివరాలను అధికారులకు తెలపాలని కోరారు. కార్యక్రమంలోఎంపిడిఒ శేషగిరిరావు, పంచా యతీ కార్యదర్శులు పాల్గొన్నారు.**తంబళ్లపల్లి:** మండలంలో నుంచి కుల గణన కార్యక్రమం ప్రారంభమైంది. ఇంటింటికి వెళ్లి కుల గణన సర్వే సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ సురేంద్రనాథ్ ఆదేశించారు. కుక్కరాజుపల్లెలో జరుగుతున్న కుల గణన సర్వేని పరిశీలించారు. కులగమన యాప్‌లో పూర్తి సమాచారాన్ని పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమతి, సచివాలయ ఉద్యోగులు గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న అల్లాబకాష్

కాంగ్రెస్‌లో 60 మంది చేరిక

మదనపల్లి : పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు అల్లా బకాష్ సారథ్యంలో 60 మంది కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నియోజకవర్గ నాయకులు రెడ్డిసాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అందరూ కలసికట్టుగా పనిచేసి దేశ భవిష్యత్తు కోసం రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ గోడ పత్రికలను ఆవిష్కరించారు.కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, జిల్లా బిసి నాయకులు మీనాకుమారి, చల్లా నాని, మైనార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్‌కె.బాషా, వెంకటరమణ, సెక్రెటరీ అనంత చలపతి, రూరల్ మండలఅధ్యక్షులు వై.సురేంద్రరెడ్డి, షేక్ అన్వర్‌బాషా పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నందలూరు : మండలంలో విద్యుత్ మెయింటినెన్స్ పనుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇఇ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట 132కెవి మరమతులు నిర్వహిస్తుండడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రైం కార్నర్

8 మంది కోడిపందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కోడి పందెం స్థావరంపై దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..శుక్రవారం నిమ్మనపల్లి పంచాయతీ వెంగళవారిపల్లి కురవపల్లి సమీపంలో కొంతమంది కోడిపందెం ఆడుతున్నట్లు రహస్య సమాచారం అందిందన్నారు. తమ సిబ్బందితో కలిసి కోడిపందెం స్థావరంపై దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.3,350లు, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. ఈదాడుల్లో సిబ్బంది చక్రవర్తి, కానిస్టేబుల్‌లు రాజేష్, శివ, సంతోష్‌లు పాల్గొన్నారు.

దళితులపై దాడి ఘటనలో కేసు నమోదు

ప్రజాశక్తి-కలికిరి

దళితులపై దాడి చేసిన సంఘటనలో కేసు నమోదు చెసినట్లు పోలీసుల తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కలికిరి టౌన్, తోపుకాడ దళితవాడలో నివాసమున్న ముల్లంగి అనూష ఈ నెల 18 రాత్రి కలికిరి టౌన్ సమీపంలో హైవే పక్కన ఉన్న తమ స్థలంలో తన తమ్ముడు అనిల్ కుమార్, తల్లి రమణమ్మ, తమ్ముని స్నేహితులైన అజయ్ కుమార్, దీపక్ లతో కలిసి పశువుల షెడ్ నిర్మాణపు పనులు చేస్తూ వుండగా గొల్లపల్లి అవినాష్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఒక స్కోర్పియో వెహికల్‌లో తమ వెంట ఒక జెసిబి ని తీసుకొచ్చారని తెలిపారు. నిర్మాణపు పనులు ఆపమని కులం పేరుతో దూషించి అసభ్యముగా మాట్లాడి తమ చేతులలోని ఇనుప రాడ్లతో విచక్షణా రహితంగా దాడిచేయడంతో అజయ్‌కుమార్‌కు తలపైన తీవ్ర రక్త గాయాలు అయ్యినట్లు తెలిపారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలతో బయట పడ్డారని అన్నారు. అనంతరం అవినాష్ రెడ్డి తన అనుచరులతో కలిసి బాధితులకు చెందిన టాటా సుమోను ధ్వంసం చేసి, ఒక వివో మొబైల్ పొనును లాక్కొని, జరిగుతున్న సంఘ టనను వీడియో తీస్తున్న దీపక్ రెడిమి నోట్ మొబైల్ ఫోన్‌ను కూడా లాక్కొన్నారని చెప్పారు. నిందితులందరూ జెసిబితో పశువుల షెడ్‌ను ధ్వంసం చేసి, తిరిగి దానిని నిర్మిస్తే అందరినీ చంపుతామని బెదిరించి వెళ్ళిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. అనూష పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కలికిరి హెడ్ కానిస్టేబుల్ మనోహర్ కేసు నమోదు చేశారని, వాయల్పాడు సిఐ పి.సురేష్ కుమార్ బాధితులను విచారించి, సంఘటనా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లి

కాలిన గాయాలతో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శుక్రవారం మదనపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి మండలం బొమ్మనచెరువు పంచాయితీ టేకులపాలెంకు చెందిన రామకృష్ణ కుమారుడు కేశవ(48) శుక్రవారం మదనపల్లి కు వచ్చాడని, అక్కడ ఏమి జరిగిందో ఏమో బసినికొండలోని ఓ వీధిలో ఒళ్లంతా కాలిన గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా స్థానికులు గుర్తించి 108కు సమాచారం ఇచ్చారని అన్నారు. కేశవ అపస్మారక స్థితిలో తాగి మద్య మత్తులో పడి ఉండగా ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో కాలి గాయపడ్డాడని అనుమానం వ్యక్త మవుతుందన్నారు. టేకులపాలెంలో మంగళవారం పశువుల పండుగ జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. గురువారం రాత్రి కూడా ఇంటి దగ్గరే ఆరోగ్యంగా బాగున్నాడని చెప్పారు. పశువుల పండుగలో చిట్లాకుప్పకు నిప్పు పెట్టడంతో ఎద్దులు బెదిరితనను మంటల్లోకి ఈడ్చికెళ్లడంతో కాలాయని మృతుడు తెలిపినట్లు ఆస్పత్రి వర్గాల వెల్లడించాయని అన్నారు. కేశవకు ఏమి జరిగిందనే నిజ నిజాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉందని చెప్పారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటన సమాచారం అందుకున్న రెండవ పట్టణఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.